

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తాం

- టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రమేశ్‌బాబు

గణేశ్‌నగర్,నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించాలన్న సంకల్పంతో టోల్ ఫ్రీ నంబర్ 1912 అన్ని ట్రాన్స్‌ఫార్మర్లపై ముద్రిస్తున్నామని కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు తెలిపారు. ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తినా టోల్ ఫ్రీ నంబర్ 1912కు సంప్రదించాలని కోరారు. విద్యుత్ వినియోగదారుడు 1912కు ఫోన్ చేయగానే అధికారులు ఫిర్యాదును స్వీకరిస్తారని తెలిపారు. ఫిర్యాదును నమోదు చేసి ఫిర్యాదుదారుడికి మెసేజ్ రూపంలో సమాచారం అందిస్తారని తెలిపారు. దీనిపై ఉన్నత స్థాయి అధికారులు సమీక్ష నిర్వహించి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తారన్నారు. దీనితో త్వరిత గతిన సమస్యలు పరిష్కారం అవుతాయని వివరించారు. విద్యుత్ అధికారుల దృష్టికి సమస్యలు తీసు కురావాలని ఎస్ఈ కోరారు.

వామ్మో చలి..

- పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఉదయం 10 దాటినా తగ్గని ఈదరుగాలులు
- మరో మూడు, నాలుగు రోజులు ఇదే పరిస్థితి



కరీంనగర్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వామ్మో... ఇదేమి చలి అంటూ ఎవరి నోట అయినా ఇదే మాట... గత మూడు, నాలుగు రోజులుగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో చలితీవ్రత పెరుగుతోంది. దీనితో ఇళ్ల నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, రక్తహీనతతో బాధపడుతున్నవారు, వ్యాధిగ్రస్తులు, మహిళలు చలితీవ్రతను తట్టుకోలేక ఇప్పుడే చలి ఇంతగా ఉంటే మరో రెండు నెలలు మరింత తీవ్రంగా ఉంటుందని భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి 6 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు చలి, చల్లటి ఈదురుగాలులు వీస్తున్నాయి. జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలకు పడిపోవడంతో చలితీవ్రత పెరిగిందని, మరో మూడు, నాలుగు రోజులపాటు చలితీవ్రత అధికంగా ఉంటుందని తప్పనిసరి అయితే తప్ప ఇళ్లనుంచి బయటకు రావాలని, బయటకు వచ్చే ముందు చలిబారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచి స్తున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో మైదానాలకు వెళ్లే వాకర్స్, విద్యార్థులు, ఇతర పనులు చేసుకొని జీవించే వారు చలి తీవ్రతను తట్టుకునేందుకు స్వెట్టర్లు, తలకు క్యాప్‌లు, రుమాళ్లు, మహిళలు చున్నీలను ధరిస్తున్నారు. ఉదయం 10 గంటల వరకు కూడా రోడ్లపై మంచు కప్పుకోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆరుబయట మంటతో చలికాగుతూ చలినుంచి ఉపశమనం పొందుతున్నారు. సంక్రాంతి వరకు చలి తీవ్రత మరింత పెరిగే అవకాశాలుంటాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెపుతుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

ఆకట్టుకున్న దీక్షాంత్ పరేడ్

- పీటీసీ, సీటీసీల్లో శిక్షణ పూర్తి చేసుకున్న 1,350 మంది కానిస్టేబుళ్లు
- ముఖ్యఅతిథులుగా ఏసీబీ డీజీపీ విజయ్‌కుమార్, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీజీ కమలాసన్‌రెడ్డి, కవాతు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు

కరీంనగర్‌లోని పోలీస్ శిక్షణ కళాశాల(పీటీసీ)లో 1,102 ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్లు, సిటీ ట్రైనింగ్ సెంటర్(సీటీసీ)లో రాచకొండ కమిషనరేట్‌కు చెందిన 248 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు 9 నెలల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి చేశారు. గురువారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ విజయ్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ విబి కమలాసన్‌రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి హాజరయ్యారు.

-కరీంనగర్ క్రైం, ఆంధ్రజ్యోతి

7

మినీ స్టేడియం నిర్మాణం పూర్తయ్యేనా?

- శంకుస్థాపన చేసి ఏడాదైనా కదలని పనులు

-హుజూరాబాద్, ఆంధ్రజ్యోతి

6

రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

హుజూరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. గురువారం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని ఆయన సందర్శించారు. హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలందించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరిగేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ సుధాకర్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి వెంకటరమణ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగుల సంఖ్య, వైద్య సిబ్బంది పనితీరు పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కృష్ణకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు లైఫ్‌స్కిల్స్‌పై శిక్షణ

- కలెక్టర్ పమేలా సత్పతి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 200 మంది ఉపాధ్యాయులకు లైఫ్‌స్కిల్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. గురువారం కొత్తపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉదయం విద్యార్థులతో కలిసి ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని వంద ప్రభుత్వ పాఠశాలల్లో 200 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు తరగతి గదితో పాటు ప్రయోగాత్మక విద్యను బోధిస్తారన్నారు. భూమి విస్తీర్ణం, నేల రకం కాలానికి అనుగుణంగా పంటల ఎంపిక, సేంద్రీయ ఎరువులు, వాతావరణం అంచనా, మార్కెటింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు ప్రయోగాత్మక బోధన అందించడమే లైఫ్ స్కిల్స్ విద్యలో భాగమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో అవగాహన పెంపొందించుకొని భవిష్యత్తులో ఆయా రంగాలలో నిష్ణాతులవుతారన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు స్వయంగా ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌లో విత్తనాలు నాటుతున్న విధా నాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, జన్యఫౌండేషన్ మేనేజర్ సురేంద్రకుమార్, ఎంఈఓ అజీమ్, తహసీల్దార్ రాజేశ్, ప్రధానోపాధ్యాయురాలు వెంకట పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

29న బీఆర్ఎస్ దీక్షా దివస్

- కేసీఆర్ దీక్షతో తెలంగాణ కల సాకారం
- తెలంగాణ ఉద్యమానికి పురిటిగడ్డ కరీం'నగరం'
- ఒకటి రెండు రోజుల్లో వేదిక ఖరారు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): 'కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ తెచ్చుడో' అన్న నినాదంతో 2013 నవంబర్ 29న కరీంనగర్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన దీక్షతోనే తెలంగాణ ప్రజల కల సాకారం అయింది. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించింది. దీనితో నవంబర్ 29న కరీంనగర్‌లోనే దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం నిర్ణయించినందున, దీక్షా దివస్ వేదిక కోసం గురువారం తెలంగాణ భవన్ సమీపం, కేసీఆర్‌ను అరెస్టు చేసిన అల్గూనూర్‌లో స్థల పరిశీలన చేసినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. స్థల పరిశీలన అనంతరం మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి సింహగర్జనతో ఇక్కడే పురుడుపోసుకోగా కవులు, కళాకారులు, సబ్బండవర్గాల భాగస్వామ్యంతో కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. తెలంగాణ పురిటిగడ్డ అయిన కరీంనగర్‌లో చేపడుతున్న దీక్షా దివస్‌ను కవులు, కళాకారులు, ఉద్యమ కారులు, తెలంగాణ అభిమానులు, విద్యార్థులు, యువకులు, సబ్బండ వర్గాలను భాగస్వాములను చేస్తూ ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఆనాటి రాజకీయ నాయకులు వారి స్వలాభం కోసం తెలంగాణ ఉద్యమాన్ని వాడుకోవడంతో 60 ఏళ్ల తెలంగాణ కోసం పోరాడినా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడలేదని అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు కావాలని కేసీఆర్ సచ్చుడో... తెలంగాణ వచ్చుడో అనే గొప్ప నినాదంతోనే తెలంగాణ సిద్ధించిందని అన్నారు. ఈ ఉద్యమస్ఫూర్తిని భావితరాలకు తెలిపే విధంగా ఈ నెల 29న దీక్షా దివస్‌ను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని, ఒకటి రెండు రోజుల్లోనే వేదిక కూడా ప్రకటి స్తామని చెప్పారు. ఆ తర్వాత బీఆర్ఎస్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షుడు కేటీ రామారావు ఏర్పాట్లను పరిశీలించి దీక్షా దివస్‌పై ఉద్దేశాన్ని వివరిస్తారని కమలాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, నక్క పద్మకృష్ణ, నాంపల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకుడు కర్ర సూర్యశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షా దివస్‌కోసం స్థల పరిశీలన చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్‌రావు

టీటీడీ దేవాలయ నిర్మాణం పూర్తి చేయండి

- చైర్మన్ బీఆర్ నాయుడును కలిసిన జిల్లా ఎమ్మెల్యేలు



టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడుకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

కరీంనగర్, నవంబరు 21(ఆంధ్ర జ్యోతి ప్రతినిధి): కరీంనగర్‌లో తిరు మల తిరుపతి దేవస్థానం నిర్మించతల పెట్టిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ పనులను త్వరగా ప్రారంభించి పూర్తయ్యేలా చూడాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, నాయ కులు కోరారు. ఈ మేరకు గురువారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, కార్పొరేటర్ వంగపల్లి రాజేందర్‌రావు హైదరాబాద్‌లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుని కలిసి వినతిపత్రం సమర్పించారు. 2022లో తెలంగాణ ప్రభుత్వం అభ్యర్థన మేరకు టిటిడి కరీంనగర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి 20 కోట్ల రూపాయలను మంజూరు చేయడంతో పాటు ఆలయ నిర్మాణానికి టెండర్ కూడా పూర్తి చేసిందని చెప్పారు. టెండర్లలో ఆలయ నిర్మాణ పనులను దక్కించుకున్న నటరాజ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఒప్పందం చేసుకొని శంఖుస్థాపన పనులు కూడా ప్రారంభించిందని అన్నారు. ఆ పనులు ముందుకు సాగడం లేదని, ప్రత్యేక చొరవ తీసుకొని దేవాలయ నిర్మాణ పనులను పూర్తిచేయించాలని టీటీడీ చైర్మన్ నాయుడిని కోరారు.

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

- జిల్లా ఉద్యానవన అధికారి రావిలాల శ్రీనివాస్

సైదాపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్ పామ్ సాగుతో అధిక లా భాలు పొందవచ్చునని జిల్లా ఉద్యానవన అధికారి రావిలాల శ్రీనివాసరావు అన్నారు. గు రువారం సైదాపూర్ రైతు వేదికలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ భావితరాల పంటగా పేర్కొన్నారు. సంప్రదాయ నూనె గింజలకంటే 4 నుంచి 5 రెట్ల అధిక దిగుబడి ఉంటుందన్నారు. ఒకే భూమిలో నాలుగు రకాల పంటలు సాగు చేసి మూడింతల అధిక ఆదాయం పొంద వచ్చని వివరించారు. ఆయిల్ పామ్ తోట ఒక్కసారి సాగు చేస్తే 35 సంవత్సరాల వరకు దిగుబడి ఇస్తుందన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి బి మంజువాణి, వ్యవసాయ శాఖ అధికారి వైదేహి, ఏఈవోలు తిరుపతి, రజిత, రజనీకాంత్, సున్నవంశీ, రాజు, హరీష్, సూర్య పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం

- ఉపకారవేతనాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నిరసన



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గణేశ్‌నగర్,నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని, ఉపకార వేతనాలు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయా లని తెలంగాణ చౌక్‌లో ఖాళీ ప్లేట్లతో ఎస్ఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం మారితే మా జీవితాలు మారుతాయని కోటి ఆశలతో విద్యార్థులు, నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కడితే విద్యార్థులను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. దాదాపు రెండు సంవత్సరాలుగా విద్యార్థులకు రావాల్సిన ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు, కళాశాల యజమాన్యాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయన్నారు.

మాపైన అధిక భారం పడుతుందని డిగ్రీ కళాశాలలు మూసివేసి ధర్నాకు దిగితే చర్చలు పెట్టి మీ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు వారితో చర్చలేవనెత్తిన దాఖలాలు లేవన్నారు. మళ్లీ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కళాశాల యజమాన్యాలు కళాశాలల బంద్ చేపడుతున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించకపోవడం చాలా బాధాక రమన్నారు. ముఖ్యమంత్రి విద్యారంగంపై ఎందు కు శ్రద్ధ చూపెట్టడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పటికే 11 నెలలు గడుస్తున్నా విద్యారంగానికి ఒక మంత్రి కేటాయించిన పరిస్థితి లేదన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రిని కేటాయించాలన్నారు. సమస్య పరిష్కరించ కుంటే రాష్ట్రంలో ఎమ్మె ల్యేల, మంత్రుల కార్యాలయాలు ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంపెల్లి అరవింద్, భోగేశ్వర్, రత్నం సురేష్ గట్టు ఆకాష్ రాకేష్ నగర ఉపాధ్యక్షులు చందు, అక్షయ్ నాయకులు సంతోష్ పవన్, విష్ణు, అక్షయ్, రఘు, విశ్వక్, ప్రణయ్, విష్ణు, హరీష్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు

- భయాందోళనలో ప్రజలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి



రుక్మాపూర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు

చొప్పదండి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ నుంచి కాట్నపల్లి దారిలో విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా మారాయి. ఒక లైన్ మీదుగా మరో లైన్ వెళ్తోంది. మోడల్ స్కూల్ వైపుకు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ ఫీడర్ పై నుంచి కాట్నపల్లి లైన్ పోతున్నది. దీంతో రెండు కలిసిపోయే ప్రమాదం ఉంది. స్తంభం ఒక వైపుకు ఒరిగిపోగా విద్యుత్ తీగలు సమీపంలోకి వచ్చాయి. తీవ్రమైన గాలి వీస్తే వైర్లు తాకితే మంటలు చెలరేగే ప్రమాదం ఉంది. గతంలో రెండు లైన్లు కలిసిపోయిన చోట విధుల్లోఉన్న హెల్పర్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ప్రమాదం చోటు చేసుకున్నా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మినీ స్టేడియం నిర్మాణం పూర్తయ్యేనా?

- శంకుస్థాపన చేసి ఏడాదైనా కదలని పనులు
- ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు

హుజూరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి మోక్షం కలగకపోవడంతో క్రీడాకారులకు తిప్పలు తప్పడం లేదు. హుజూరాబాద్ క్రీడలకు పేరుంది. క్రీడాకారుల సంఖ్య కూడా అధికంగానే ఉంది. కాగా మినీ స్టేడియం లేని కారణంగా క్రీడాకారులు సాధన చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. హుజూరాబాద్‌లో మినీ స్టేడియం నిర్మాణం చేపట్టాలని గత 20ఏళ్లుగా డిమాండ్ ఉంది. గతంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి మినీ స్టేడియం ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వగా అలాగే మిగిలిపోయింది. మండలానికో స్టేడియం ఉండాలనే ప్రభుత్వ నిబంధనలతో 2023లో అసెంబ్లీ ఎన్నికల ముందు ఎమ్మెల్సీగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ కింద రూ. 10కోట్ల వ్యయంతో హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో మినీ స్టేడియంకు శంకుస్థాపన చేశారు. జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డి గెలిచినా రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరాజయం కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో మినీ స్టేడియం నిర్మాణానికి మోక్షం లేకుండా పోయింది.



హుజూరాబాద్‌లో మినీ స్టేడియం ఏర్పాటు చేసే హైస్కూల్ మైదానం

క్రీడలకు అడ్డాగా హుజూరాబాద్

హుజూరాబాద్‌కు క్రీడలకు అడ్డాగా గుర్తింపు ఉంది. ఇక్కడి హైస్కూల్ మైదానంలో నిత్యం వందలాది మంది క్రీడకారులు సాధన చేస్తుంటారు. హాకీ, కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడల్లో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కూడా ప్రతిభ కనబరుస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని హుజూరాబాద్ పట్టణానికి నడిబొడ్డున హైస్కూల్ మైదానం ఉండడంతో అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని రూ. 10 కోట్ల వ్యయంతో మినీ స్టేడియం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. హైస్కూల్ మైదానాన్ని మినీ స్టేడియంగా మార్చి అందులో హాకీ, కబడ్డీ, వాలీబాల్ తదితర కోర్టులను ఏర్పాటుకు మ్యాప్ కూడా సిద్ధం చేశారు. మినీ స్టేడియం ఏర్పాటు కాకపోవడంతో ఉదయాన్నే మైదానానికి వచ్చే వాకర్స్‌కు, క్రీడాకారులకు ఇబ్బందిగా మారింది. క్రీడాకారులకు సౌకర్యార్థం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, జిల్లా అధికారులు చొరవ తీసుకొని మినీ స్టేడియం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

క్రీడాకారులకు శాపంగా మారిన మినీ స్టేడియం

- బండ కిషన్, క్రీడాకారుడు, హుజూరాబాద్



హుజూరాబాద్ మినీ స్టేడియం నిర్మాణానికి పునాదులు పడకపోవడంతో క్రీడాకారులకు శాపంగా మారింది. హుజూరాబాద్‌లో క్రీడాకారులకు కొదువ లేదు. ఈ ప్రాంతం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. మినీ స్టేడియం నిర్మిస్తే మరింత మందిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దే అవకాశం ఏర్పడుతుంది. మంత్రులు, జిల్లా అధికారులు కృషి చేసి మినీ స్టేడియం నిర్మాణం త్వరితగతిన చేపట్టాలి.

కొండగట్టులో దీపారాధన



కొండగట్టులో దీపాలు వెలిగిస్తున్న అడిషనల్ కమిషనర్

మల్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న కార్తికదీపోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆలయంలో గురువారం భక్తులతో కలిసి కరీంనగర్ దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ సుప్రియ కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో రామకృష్ణరావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, అర్చకులు, వేదపండితులు, ఆగమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు

అంజన్న ఆలయం హుండీ లెక్కింపు

మల్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.1,04,36,365 నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో ఎం.రామకృష్ణ రావు తెలిపారు. 75 రోజులకు గాను ఆలయంలోని 12 హుండీలను విప్పి గురువారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 60 గ్రాముల మిశ్రమ బంగారం, 3కిలోల మిశ్రమ వెండి, 78విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, ఏఈవో వై. అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్, అధికారులు, సిబ్బంది, శ్రీలలిత సేవా ట్రస్ట్ సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.



హుండీ సొమ్ములు లెక్కిస్తున్న సిబ్బంది

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



రమేశ్(ఫైల్)

వేములవాడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన మ్యాకల రమేశ్ (27) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన మ్యాకల నర్సయ్య, లచ్చవ్వ దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. పది సంవత్సరాల క్రితం కుమారుడు, కూతురు మృతి చెందడంతో ఇద్దరే ఉంటూ వచ్చారు. చందుర్తి మండలం రామరావుపల్లి గ్రామానికి చెందిన తమ సమీప బంధువు సాయిలు-సుగుణ దంపతుల చిన్న కుమారుడు రమేష్‌ను మూడు సంవత్సరాల క్రితం దత్తత తీసుకున్నారు. రెండు సంవత్సరాల క్రితం రమేష్‌కు అంగరంగ వైభవంగా వివాహం చేశారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామ శివారులోని పెట్రోల్‌బంక్‌లో ఉపాధి కోసం పని చేస్తున్నాడు. కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన శాంసన్, వట్టింల గ్రామానికి చెందిన సాయి అనే యువకులతో కలిసి శాత్రాజుపల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో మ్యాకల రమేష్‌కు తలకు తీవ్రగాయాలతో మృతి చెందాడు. శాంసన్, సాయిలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కొడుకులు లేరని దత్తత తీసుకున్న తల్లిదండ్రులు, మంచిగా బతకాలని దత్తత ఇచ్చిన కన్న తల్లిదండ్రులు కొడుకు అకాల మరణంతో రోదించిన తీరుకు స్థానికులు కన్నీటి పర్యంతం అయ్యారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు..

మానకొండూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంషాబాద్ బస్టాండ్ వద్ద గురువారం మోటార్ సైకిల్‌ను ఆర్టీసీ బస్సు, బైకును ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. శంకరపట్నం మండలంలోని చింతగట్టు గ్రామానికి చెందిన కర్క మల్లారెడ్డి (68) అనే రైతు మోటార్‌సైకిల్(టీఎస్ 02ఈకే 8607)పై మండలంలోని గట్టుదుద్దెనపల్లి పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోసుకొని ఇంటికి తిరిగి వెళుతున్నాడు. వరంగల్ నుంచి కరీంనగర్ వైపు వస్తున్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టీఎస్ 23 జడ్ 0015) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లారెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మల్లారెడ్డి భార్య కర్క విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

మానేరు నీటిలో మునిగి యువకుడు..



అనిల్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణ శివారులోని మానేరు కరకట్ట వద్ద కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన జంగిలి అనిల్(37) అనే యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. టౌన్ సీఐ కె కృష్ణ వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి గ్రామానికి తన తండ్రి బాగా లేడని చూసేందుకు ఇటీవల వచ్చాడు. తిరిగి ఈనెల 19న తెల్లవారుజామున నిజామాబాద్ వెలుతున్నానని చెప్పి ప్రమాదవశాత్తు మానేరు నీటిలో గురువారం శవమై తేలాడు. అనిల్‌కు భార్య, ఇద్దరు కూతుళ్ల, కుమారుడు ఉన్నారు. నిజామాబాద్‌కు ఇల్లరికం వచ్చి ఇక్కడే ఉంటున్న తన భర్త అనిల్ తండ్రిని చూసి వస్తానని మండెపల్లికి వెళ్లాడని, తిరిగి వస్తూ చేపల వేటకు మానేరులోకి దిగి ఊపిరాడక నీటిలో మునిగి మృతిచెందాడని భార్య గీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో వానరం మృతి



మృతి చెందిన వానరం

రామడుగు, నవంబరు 21 (ఆంధ్యజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో వానరం మృతి చెందింది. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఉన్న విద్యుత్ వైర్లను వానరం పట్టుకొని స్తంభం ఎక్కే సమయంలో షాక్‌కు గురై తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. వానరం మృతి విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి సరఫరాను నిలిపివేయించారు. అనంతరం గ్రామస్థుల సహాయంతో వానరాన్ని ఖననం చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మంథని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలోచవరం క్రాస్‌రోడ్డు రోడ్డు ప్రమాదంలో గురువారం దంపతులకు గాయాలయ్యాయి. మండలంలోని గుంజపడుగు ప్రాథమిక పాఠశాలలో విధులు ముగించుకొని టీచర్ అగజ తన భర్త గంగారెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మంథని-గోదావరిఖని ప్రధాన రహదారి ఎక్కే క్రమంలో విలోచవరం క్రాస్‌రోడ్డు వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో వారు కింద పడటంతో తలకు, శరీరంలో పలుచోట్ల గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాట్సప్‌కు ఎస్‌బీఐ పేరిట లింక్‌లు

మల్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాట్సప్‌లో ఎస్‌బీఐ పేరిట వచ్చిన ఏపీకే లింక్‌లు సెల్‌ఫోన్ వినియోగదారులను ఆందోళన గురి చేశాయి. ఎస్‌బీఐ కేవైసీ చేసుకోవాలని వచ్చిన లింక్‌లతో పలువురి ఫోన్‌లు హ్యాక్ అయ్యాయి. మండలంలోని ముత్యంపేటకు చెందిన యాల్ల మధురెడ్డికి చెందిన వాట్సప్ హ్యాక్ కావడంతో అతని నంబరు గల వారందరితో పాటు వందలాది గ్రూప్‌లకు గురువారం వేకువజామున ఎస్‌బీఐ పేరిట లింక్‌లు వచ్చాయి. కాగా ఇటీవల ఏపీకే పేరిట వచ్చె వాటిని ఓపెన్ చేయవద్దనే సూచనలతో సెల్‌ఫోన్ వినియోగదారులు అప్రమత్తం అయ్యారు. వెంటనే వాటిని తొలగించి మధురెడ్డికి సమాచారం అందించారు. దీంతో అతను వాట్సప్ ఫోన్ నుంచి అన్‌ఇన్‌స్టాల్ చేసి మళ్లీ ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. అప్పటికే కొందరు ఓపెన్ చేసినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-363పై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. గోదావరిఖనికి చెందిన నలుగురు కారులో కన్నెపల్లి మండలంలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి దర్శనం నిమిత్తం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శ్రీరాంపూర్ వద్దకు రాగానే జాతీయ రహదారిపై ముందు ప్రయాణిస్తున్న ఎక్స్‌కావేటర్(జేసీబీ)ను ఢీకొట్టారు. దీంతో కారు హైవే దిగి కింద ఉన్న సర్వీస్ రోడ్డుపైకి వెళ్లింది. కారు బెలూన్లు తెరచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. నలుగురికి గాయాలు కావడంతో క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన కారు రోడ్డు మధ్యలో ఉండడంతో ఢీకొన్న ఎక్స్‌కావేటర్‌తోనే పక్కకు తొలగించారు. ప్రమాదంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి గాయాలు

భీమారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆరేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో గోదావరిఖనికి చెందిన జక్కుల ఐలయ్య, గాదె పోశంలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖనికి చెందిన ఐలయ్య పోశంలు చెన్నూరుకు వెళ్తుండగా ఆరేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో పోశంకు తీవ్ర గాయాలు కాగా ఐలయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

ఎక్సైజ్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించండి

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ డివిజన్ ఎక్సైజ్ అధికారులతో గురువారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో జరుగుతున్న పనితీరుపై ఆయన సమీక్షించారు. మొదట ఆయన ఎక్సైజ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మాట్లాడుతూ ఎక్సైజ్ అధికారులు డ్రగ్స్, గంజాయి, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌తోపాటు నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. వీటితోపాటు పోలీసుఠాణాలలో వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను డిస్పోజల్ అధికారి అనుమతితో కాల్చివేయాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా చర్యలు పేట్టాలన్నారు. స్టేషన్లలో చార్జీషీట్ వేయని కేసుల్లో వెంటనే చార్జీషీట్స్ వేయాలని, కేసుల్లో శిక్షలు పడేవిధాంగా చర్యలు చేపడితే ఎక్సైజ్ క్రైమ్ చేయాలంటే నేరస్థులు భయపడుతారని అన్నారు. మద్యం ఎంఆర్‌పీ ధరలు కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు జరిపే విషయంపై కూడా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ టి డెవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ కె వరప్రసాద్, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి ఎక్సైజ్ సూపరింటెండెంట్లు పి శ్రీనివాసరావు, ఏ సత్యనారాయణ, ఎస్ పంచాక్షరీ, ఆర్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇదిలాపూర్‌కు చెందిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శివరాత్రి వివాహిత స్వప్న(35)ను కాల్వశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన ధారంగుల రాజయ్య ఎప్పుడు ఫోన్‌చేసి అసభ్యకర మాటలు మాట్లాడడం వలన ఈనెల 18న తన ఇంటిలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు స్వప్నను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి తల్లి పోచమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

జాతీయ ఉత్తమ బాల పురస్కార్ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న జ్యోతిక

సుల్తానాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరోనా విపత్కర సమయంలో చేసిన సేవా కార్యక్రమాలతోపాటు దుబారా ఖర్చులు వద్దని చేస్తున్న ప్రోగ్రాంలకు గాను సుల్తానాబాద్‌కు చెందిన చిన్నారులు ఏగోలపు జ్యోషిక, ఏగోలపు కౌశిక్‌లకు జాతీయ ఉత్తమ బాల పురస్కార్ అవార్డు-2024 అందించారు. మార్క్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు నీరజ గౌనె, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చేరిపెల్లి దినేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవ అవార్డు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ స్పీకర్ మధుసూదనాచారి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, పుష్పచంద్రశేఖర్‌లు అవార్డు అందించారు.

నాచుపల్లి జేఎన్‌టీయూలో విద్యార్థి అదృశ్యం

కొడిమ్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న ఎ హితేష్ అదృశ్యమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి ప్రభాకర్ తెలిపారు. హితేష్ ఈ నెల 19న అనుమతి లేకుండ హాస్టల్ నుంచి వెళ్లినట్లు తెలిపాడు. హాస్టల్ కేర్ టేకర్, తోటి విద్యార్థుల ద్వారా అదృశ్యం విషయం తెలుసుకొని కొడిమ్యాల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. హితేష్ ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం జిల్లా దరువుబిల్లి మండలం రావివలస గ్రామానికి చెందినవాడని చెప్పారు. విద్యార్థి దృశ్యంపై గురువారం మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల హెడ్ కానిస్టేబుల్ అర్షరాజు విచారణ చేపట్టారు. ఈ మేరు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ అర్షరాజు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు పశువులు మృతి

సిరిసిల్ల క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం మొదటి బైపాస్ రహదారిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు పశువులు మృతిచెందాయి. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన దూమాల రంజిత్ అనే రైతుకు చెందిన అయిదు పశువులు(బర్రెలు) రహదారి వైపునకు మేతకు వెళ్లాయి. గుర్తుతెలియని వాహనం ఢీకొనగా రెండు అక్కడికక్కడే మృతిచెందగా మరో మూడు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి.

వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో పెళ్లి కావడం లేదని యువకుడు ఉరివేసుకున్నాడు. కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి ఓ వ్యక్తి అనారోగ్యంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట కు చెందిన ఓ యువకుడు దుబాయ్‌లో బలవన్మరణానికి పాల్పడ్డాడు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో ఉరివేసుకున్నాడు.

- పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య




సంతోష్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పెళ్లి చేయడం లేదని మనస్తాపం చెందిన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన దంపెటి సంతోష్ (25) అనే యువకుడు బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... పట్టణం లోని నెహ్రూనగర్‌కు చెందిన నేత కార్మిక కుటుంబమైన దుంపెటి లలిత, భూమయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. నేత కార్మికుడైన భూమయ్య పవర్‌లూం పని చేస్తూ అప్పుడప్పుడు కూలీకి వెళ్తుంటాడు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లి చేయడంతో ఐదు లక్షల రూపాయలకు పైగా అప్పులు అయ్యాయి. కుమారుడు సంతోష్ ప్లంబింగ్ పని చేస్తుంటాడు. పెళ్లి చేయాలని తరుచుగా తల్లిదండ్రులను అడిగినప్పటికీ అప్పులు కావడంతో ఇప్పుడే ఎందుకని చెప్పడంతో సంతోష్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగుతున్నాడని కుమారుడికి ద్విచక్రవాహనం ఇవ్వడం మానేశారు. ఇప్పట్లో తనకు పెళ్లిచేయరని మనస్తాపం చెందిన తల్లిదండ్రులు ఉన్న గదికి తాళం వేసి మరో గదిలో సంతోష్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని బల వన్మరణానికి ఒడిగట్టాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

- అనారోగ్యంతో మనస్తాపం చెంది..

కోనరావుపేట, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన మానుపాటి చంద్రయ్య (57) అనే వ్యక్తి గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రయ్య కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై భార్య లక్ష్మి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై ప్రశాంత్‌రెడ్డి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు రాజు, శంకర్ ఉన్నారు.

- దుబాయ్‌లో మొగిలిపేట వాసి బలవన్మరణం



శ్రీనివాస్(ఫైల్)

మల్లాపూర్, నవంబరు, 21 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని మొగిలిపేటకు చెందిన ఓ యువకుడు దుబాయ్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొగిలిపేట గ్రామానికి చెందిన దండ్ల శ్రీనివాస్ (34) అనే యువకుడు మూడేళ్ల క్రితం జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. పనులు ముగియగానే లీవు దొరకగానే ఇంటికి తిరిగి వస్తానని చెప్పిన యువకుడు దుబాయిలో ఊరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వృద్ధురాలైన తల్లి, భార్య, పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు. లీవు దొరికితే ఇంటికి వస్తానని భార్య పిల్లలతో ఫోన్‌లో మాట్లాడిన శ్రీనివాస్ బలవన్మరణం పొందిన సమాచారం తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువుల్లో విషాదం నెలకొంది. శ్రీనివాస్ మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా తెప్పించాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వడ్డెర సంఘం నాయకులు మోహన్, సాయిరామ్, తదితరులు ప్రభుత్వాన్ని కోరారు.

- కుటుంబకలహాలతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

తంగళ్లపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎస్‌కె అన్వర్(33) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల కథనం ప్రకారం.. జిల్లెల్ల గ్రామానికి చెందిన అన్వర్ కొద్ది సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం కుటుంబంతో సిద్దిపేటకు వలస వెళ్లి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్య భర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం అన్వర్ భార్య ఆఫ్రీన్, ఇద్దరు కుమార్తెలు సాన(9), అయూష(7), కుమారుడు ఇమామ్(2)ను తీసుకుని భర్త నుంచి దూరంగా వెళ్లిపోయింది. భార్య పిల్లలు వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన అన్వర్ సిద్దిపేట నుంచి నాలుగు రోజుల క్రితం స్వగ్రామం జిల్లెల్లకు వచ్చాడు. గురువారం రాత్రి జిల్లెల్ల శివారులోని రాములోని బండ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని శవమై కనిపించాడు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూనిఫాంపై మక్కువతోనే..

● కానిస్టేబుల్ ఉద్యోగుల్లో ఉన్నత విద్యావంతులే అధికం



కుటుంబ సభ్యులతో అభ్యర్థి

కరీంనగర్ క్రైం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఇంటర్ అర్హత అయినప్పటికీ పీజీ, ఇంజనీరింగ్, బీఫార్మసీ, డిగ్రీ చదివిన ఉన్నత విద్యావంతులు, కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పరీక్ష రాసి ఎంపికయ్యారు. పోలీస్ యూనిఫాంపై ఉన్న మోజు లేదా గౌరవం యువతను పోలీసుశాఖలో ఉద్యోగం చేయాలనే పట్టుదలను, ఇష్టాన్ని పెంచిందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. కరీంనగర్‌లోని సిటీ ట్రైనింగ్ సెంటర్(సీటీసీ), పోలీస్ శిక్షణ కళాశాల(పీటీసీ)లో 9 నెలలపాటు కానిస్టేబుల్ శిక్షణ పొందారు. .

● పోలీసుశాఖలో చేరాలనే కోరికతో....

- చింతల సాయికిరణ, యాదాద్రి జిల్లా భువనగిరి



చిన్నప్పటి నుంచి పోలీసు యూనిఫాంపై మక్కువ ఉండేది. మా బావ పోలీసు ఉద్యోగం చేస్తున్నాడు తాను కూడా ఎలాగైనా పోలీసు ఉద్యోగం చేయాలనే సంకల్పంతో పరీక్షరాసి మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. ఎమ్మెస్సీ పూర్తిచేశాను. మొదటి పోటీ పరీక్షరాయగా కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పరిగణలోకి తీసుకుని నీతి, నిజాయితీగా పనిచేస్తూ ప్రజలకు అన్ని విధాల సేవలు అందిస్తాను.

● కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావటం ఆనందంగా ఉంది

- బోయిని యాదగిరి, యదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపూర్



బీఫార్మసీ పూర్తిచేశాను. ఇదే సమయంలో పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్ పడగా దరఖాస్తు చేసి మొదటి సారి పరీక్షలో ఉద్యోగానికి ఎంపికయ్యాను. సామాన్య ప్రజలకు న్యాయం అందించటం, రక్షణ కల్పించటం, క్రమశిక్షణ కలిగిన కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరటం ఆనం దంగా ఉంది, మా తల్లిదండ్రులు కూడా సంతోషంగా ఉన్నారు. ఈ శిక్షణలో పోలీసుల విధులు, సేవలు, చట్టాలు, అమలు అంశాలపై క్షున్నంగా నేర్చుకున్నాం. ముఖ్యంగా ఫిట్‌నెస్ సాధించాం.

● తండ్రి లేని లోటు లేకుండా పెంచాను

- ఉట్ల సాయి సుమన్ తల్లి రమ, యాదాద్రి జిల్లా బ్రాహ్మణపల్లి



వ్యవసాయంలో పంట దిగుబడి రాక అప్పుల బాధతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. కూతురు, కొడుకులను నా తండ్రి సహాయంతో కష్టపడి ఇద్దరు పిల్లలను పెంచాను. తండ్రిలేని లోటు రాకూడదని గ్రామంలో ఆశావర్కర్‌గా పనిచేసుకుంటూ సాయి సుమన్‌ను ఇంజనీరింగ్ చదివించాను. పోలీసుశాఖలో ఉద్యోగం కోసం కొడుకు ఇదివరకు ఒక సారి పరీక్ష రాశాడు. కాని రాకపోవటంతో రెండవసారి పరీక్షరాసి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావటం సంతోషంగా ఉంది.

పోలీస్‌శాఖ గౌరవాన్ని పెంచాలి



ఉత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్‌కు ట్రోఫీని అందజేస్తున్న డిజి కమలాసన్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న ట్రైనింగ్ పూర్తిచేసుకున్న కానిస్టేబుల్స్

- ● డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి
- ● పీటీసీ, సీటీసీల్లో శిక్షణ పూర్తి చేసుకున్న 1,350 కానిస్టేబుళ్లు
- ● దీక్షాంత్ పరేడ్ హాజరైన పోలీస్ ఉన్నతాధికారులు

కరీంనగర్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నిజాయితీతో ప్రజలకు సేవ చేస్తూ పోలీస్‌శాఖ గౌరవాన్ని పెంచాలని డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని పోలీస్ శిక్షణ కళాశాల(పీటీసీ)లో 1,102 ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్ల, సిటీ ట్రైనింగ్ సెంటర్(సీటీసీ)లో రాచకొండ



కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డిజి కమలాసన్‌రెడ్డి

కమిషనరేట్‌కు చెందిన 248 మంది ఏఆర్ కానిస్టేబుళ్ల 9 నెలల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి చేశారు. గురువారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ విజయ్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ విబి కమలాసన్‌రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి హాజరయ్యారు. సీటీసీలో జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథికి కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, సీటీసీ ప్రిన్సిపాల్ అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఏసీపీ వేణుగోపాల్ పూల మొక్కలతో స్వాగతం పలికారు. పరేడ్ కమాండర్ గౌరవ వందనం అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ ట్రైనింగ్‌లో చేరిన 248 మందిని తీర్చి దిద్దిన సీటీసీ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. 9 నెలల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ఎంతో కష్టపడి విజయవంతంగా పూర్తి చేసినందుకు వారందిరినీ అభినందిస్తున్నామన్నారు. శిక్షణలో చాలా వరకు ఉన్నత చదువులు అభ్యసించిన వారే ఉండడం సంతోషం కలిగించిందన్నారు. పోలీస్‌శాఖలో చేరినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు. పోలీస్ ఉద్యోగం అంటేనే త్యాగానికి ప్రతీక అన్నారు. ఉద్యోగంలో నిత్యం అనేక సవాళ్లు ఎదురవు తాయని, వాటిని ఎదుర్కొని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. పోలీస్ శాఖలో ఎంతో నిజాయితీతో, అంకితభావంతో ప్రజలకు సేవలందిస్తామని ట్రైనీ కానిస్టేబుళ్లచేత సీటీసీ ప్రిన్సిపా ల్, అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మీనారాయణ ప్రమాణం చేయించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టే బుళ్లు దీక్షాంత్‌పరేడ్ చేశారు. సీటీసీలో 2019- 20లో మీయావాకి పద్ధతిలో ఏర్పాటు చేసిన చిట్టడవిని సంరక్షిస్తున్నందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిని డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఏసీపీ వేణుగోపాల్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- ● రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కరీంనగర్ రాంనగర్‌లోని పోలీస్ శిక్షణ కళాశాలలో 1,102 మంది (సివిల్, ఏఆర్) శిక్షణ పొందారు. ఈ కార్యక్రమములో పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్ అధ్వర్యంలో జరగగా, ముఖ్య అతిథిగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ విజయ్‌కుమార్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణార్థులు సాంకేతికతను మెరుగు పరుచుకొని చట్టాలపై అవగాహన పెంచుకుంటూ మానసికంగా, శారీరకంగా సన్నద్ధం కావాలి అన్నారు. అలాగే ఉద్యోగంలో క్రమశిక్షణతో పాటు ప్రజల హక్కులను కాపాడుతూ వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. శిక్షణ కానిస్టేబుళ్లు చేసే ప్రతి చర్య కూడా డిపార్ట్మెంట్ గౌరవం పెంచేవిగా ఉండాలన్నారు. వృత్తి పరంగా, నడవడిక పరంగా ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. చెడు ఎక్కడ ఉన్నా దానిని అణచి వేసే దిశగా అడు గువేయాలని అన్నారు. పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ కానిస్టేబుళ్ల 9 నెలల శిక్షణ పూర్తి అయిందని తెలిపారు. డీజీపీ (ట్రైనింగ్) అభిలాష్ బిస్త్ సూచనల మేరకు శిక్షణ స్థాయిని, కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్ఐ స్థాయికి పెంచి మారుతున్న అవసరాలకనుగుణంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

గంజాయి సాగుచేస్తున్న వ్యక్తి పై కేసు నమోదు

సారంగాపూర్, నవంబరు, 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి సాగుచేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల మేరకు రేచపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి తిరుపతి అనే వ్యక్తి తన వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నడన్న సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా తన భూమిలో 9 పచ్చని గంజాయి చెట్లు, 300 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు, రూ, 97,500. పంచుల సమక్షంలో పంచనామ చేసి సీజ్ చేశారు. అతడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

మంథని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి వారి నుంచి 1.232 కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్లు సీఐ రాజు గురువారం తెలిపారు. సీఐ రాజు కథనం ప్రకారం.. మంథని ఎస్ఐ రమేష్ అందిన నమ్మదగ్గ సమాచారం మేరకు సిబ్బంది రమేష్, వెంకటేశ్వర్లు, అనిల్‌లతో కలిసి మున్సిపల్ పరిధిలోని కుచిరాజ్‌పల్లి గ్రామ శివారులో మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులను పట్టుకొని తనిఖీ చేయగా కవరల్లో గంజాయి లభించిందన్నారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లి గ్రామానికి చెందిన నక్క ప్రేమస్, మండలంలోని లక్కెపూర్ గ్రామానికి మోహమ్మద్ అర్శత్‌లు ఇచ్చినట్లు తేలిందని, వీరిద్దరికి గంజాయి తాగే అలవాటు ఉందని, కొంత వీరు తాగి మిగితాది చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి ఒక్కొక్క ప్యాకెట్ రూ.500 లకు అమ్ముకుంటారని వారు వెల్లడించి నట్లు తెలిపారు. 20 రోజుల క్రితం తాము మహారాష్ట్రలోని సిర్వోంచ మండలంలోని యాటపల్లి గ్రామానికి చెందిన సమీర్ వద్ద రెండు కిలలో గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చారని వివరించారు. ఇందులో కొంత తమ స్నేహితు లైన రత్న బన్నీ, కళ్యాణ్, వివ, రమేష్‌లకు విక్రయించారిన తెలిపారు. మిగిలింది వారు తాగి, మళ్లీ ఎవరికైనా అమ్ముతామని తమవద్ద ఉంచుకున్నారన్నారు. వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. యువత వ్యసనాల బారిన పడకుండా క్రమశిక్షణతో చదవాలని సూచించారు.

ధర్మపురి ఆలయ అభివృద్ధికి సీఎం కృషి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ధర్మపురి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం అభివృద్ధి కోసం సీఎం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి గురువారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్దాల చరిత్ర కలిగి ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి ప్రభుత్వ విప్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరినట్లు ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పినట్లు ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్ద పీట వేసినట్లు ఆయన తెలిపారు. రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉనట సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ 2 లక్షలు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. గత ఆగస్టు 15 వరకు రైతులకు రూ 18,000 కోట్ల రుణమాఫీ చేసినట్లు ఆయన వివరించారు. దీనికి తోడు రైతులు విక్రయించే సన్న రకం వరి ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి, రూ 500 బోనస్ అందిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తుందని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, సుముఖ్, స్తంభంకాడి గణేష్, షబ్బీర్ పాల్గొన్నారు.

అధునాతన టెక్నాలజీతో జైళ్ల నిర్మాణం

- జైళ్లశాఖ వరంగల్ రేంజ్ డీఐజీ ఎం సంపత్



మాట్లాడుతున్న జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డిప్యూటీ జనరల్ సంపత్

కరీంనగర్ క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాల్లో అధునాతన టెక్నాలజీతో జైళ్లను నిర్మిస్తున్నామని జైళ్లశాఖ వరంగల్ రేంజ్ డీఐజీ ఎం సంపత్ అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని జైలు అధికారులు, సిబ్బందికి రెండు రోజుల పునశ్చరణ తరగతులు గురువారం కరీంనగర్ జైలులో ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్ హాజరై మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో అధునాతన టెక్నాలజీతో జిల్లా జైలును నిర్మిస్తున్నామన్నారు. ఇతర జిల్లాల్లో కూడా అధునాతన టెక్నాలజీతో జైళ్లను నిర్మించి, ఖైదీల రద్దీని తగ్గిస్తామని తెలపారు. మరో అతిథి శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ జైళ్ల శాఖ తీసుకుంటున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, సంస్కరణలు గురించి కొనియాడారు. కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రీజినల్ లెవల్ రిట్రీట్‌లో భాగంగా ఖైదీల సంక్షేమం, సిబ్బంది సంక్షేమం, క్రమశిక్షణ, ఆరోగ్యం, సెక్యూరిటీ గురించి చర్చించి భవిష్యత్తులో జైళ్ల శాఖ ప్రతిష్టను పెంపొందించే విధంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జైలు వైద్య అధికారి డాక్టర్ కె వేణుగోపాల్, సైకియాట్రిస్ట్ ఎల్ వర్షి, అప్పన్న గారి వెంకట్రావు, జైలర్స్ పి శ్రీనివాస్, రమేష్, పర్శరామ్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.సుధాకర్‌రెడ్డి, రమేష్, సంగీత, మినిస్టీరియల్, మెడికల్ సిబ్బంది, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ నిజామాబాద్ జిల్లాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. కార్తీక మాసం సందర్భంగా క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో నదిలో కార్తీక దీపాల వదిలారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపిం చారు. స్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



గోదావరి నది వద్ద హారతి పూజలు చేస్తున్న అర్చకులు

20 వ రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 20 వ రోజు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం నుంచి నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోక క్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితుల మంత్రో చ్ఛరణల మధ్య అర్చకులు నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోరుట్లలో వేంకటేశ్వర కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోరుట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం గురువారం వేదపండితులు టీర్నంది నర్సింహచారీ మత్రోచ్చారణల మధ్య సాగింది. దేవాలయంలో అర్చన అభిషేకార్యక్రమాలను నిర్వహించిన పురోహితులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక వేదికపై స్వామి వారి కల్యా ణాన్ని నిర్వహించారు. శ్రీలలితా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో పూలతో ముగ్గులను వేసి వాటి వద్ద కార్తిక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో దేవాలయ ఈవో విక్రం, దేవాలయ సిబ్బంది పెడిపల్లి నర్సయ్య, శ్రీలలిత సేవా ట్రస్ట్ అధ్యక్షురాలు అడ్డగట్ల లక్ష్మి, సభ్యులు తనుగుల రాజశేఖర్, గుండోజీ మనోహర్, గోడికె రాములులతో పాటు పలువురు పాల్గొన్నారు.

75శాతం హాజరు తప్పనిసరి

గణేశ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ అనుబంధ కళాశాలల్లో చదువుతున్న డిగ్రీ, పీజీ విద్యార్థులకు 75శాతం హాజరు తప్పనిసరి అని వీసీ ఉమేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ హాజరు నమోదైతే వారిని పరీక్షలకు అనుమతించబోమని ఆయన పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో పూజలు



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసంను పురష్కరించుకుని ప్రతి నిత్యం రద్దీ కొనసాగుతోంది. గురువారం రోజున వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి రాజన్నను దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకుని తరించారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు రాజన్న ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

వేములవాడ, కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. రాజన్న ఆలయ కళాభవన్‌లో పర్యవేక్షకుడు సంజీవ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్తీక దీపోత్సవం సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఓం, స్వస్తిక్ ఆకృతుల్లో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పారిశుధ్య కార్మికుల ప్రాణాలు గాలికి..

- ● సంవత్సరాలుగా అందని బూట్లు
- ● ఊసేలేని సబ్బులు, నూనె
- ● మూడేళ్లుగా అందని ఆర్జిత సెలవు సొమ్ము



జగిత్యాల మున్సిపల్ కార్మికులు

జగిత్యాల అర్బన్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) కరోనా వచ్చినా.. కలరా వచ్చినా.. వాన అయినా.. వరదైనా అలుపెరుగకుండా పనిచేసేది పారిశుధ్య కార్మికులు. వారు పనిచేయకుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఎంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. అలాంటి పారిశుధ్య కార్మికులకు వారి రక్షణ కోసం కల్పించాలని సౌకర్యాలు కల్పించడం లేదు. జగిత్యాల మున్సిపాటీలో మొత్తం 305 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో 265 మంది కాంట్రాక్టు కార్మికులు కాగా మిగతా 40 మంది పర్మనెంట్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరి రక్షణ కోసం ప్లాస్టిక్ బూట్లు సంవత్సరానికి ఓసారి ఇవాల్సి ఉంది. ప్రస్తుత మునిపల్ కౌన్సిల్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ఓసారి బూట్లు ఇచ్చిన అధికారులు మళ్లీ ఇప్పటి వరకు ఒక్క సారి కూడా బూట్లు ఇవ్వలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మురికాలువల్లో చెత్తను తొలగించే మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అనేక సార్లు మురికి కాలువల్లోకి దిగాల్సి ఉంటుంది. అలా దిగే క్రమంలో కార్మికుల కాళ్లకు గాజు పెంచుల లాంటివి గుచ్చకుండా బూట్ల అవసరం ఉంటుంది. నిత్యం మురికితో సావాసం చేసే కార్మికులకు పనిచేసే సమయంలో ఒంటికి పట్టిన మురికిని వదలించుకునేందుకు ప్రతి నెలా ఒకటి చొప్పున సంవత్సరానికి పన్నెండు బట్టల, పన్నెండు స్నానానికి సబ్బులు ఇవ్వాల్సి ఉంది అయితే అయిదేళ్లగా ఇప్పటి వరకు ఒకటి రెండు సార్లు మాత్రమే సబ్బులు ఇచ్చారని కార్మికులు అంటున్నారు. దీంతో పారిశుధ్య కార్మికులపై పాలక వర్గానికున్న నిర్లక్షాన్ని ప్రతిబింబిస్తున్నది. అలాగే కార్మికులకు ఏటా ఐదు కిలోల కొబ్బరి నూనె ఇవ్వాల్సి ఉండగా ఈ అయిదు సంవత్సరాల కాలంలో ఒక్కసారి మాత్రమే అధికారులు కొబ్బరి నూనె ఇచ్చినట్టు కార్మికులు చెబుతున్నారు.

పర్మనెంట్ కార్మికులకు ఇవ్వాల్సిన ఆర్జిత సెలవులు మూడు సంవత్సరాలుగా మంజూరు చేయక పోవడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల రక్షణ కోసం మురికి కాలువల్లో దిగి తమ ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

పూర్తి వివరాలు తెలుసుకుని సమస్య పరిష్కరిస్తాం

- చిరంజీవి మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

పారిశుధ్య కార్మికులకు ఏటా ఒక సారి ఇవ్వాల్సిన సబ్బులు, నూనె, కాళ్లకు బూట్లు రెండు, మూడు సంవత్సరాలుగా ఇవ్వని విషయం ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. దానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకొని కౌన్సిల్ ఆమోదంతో త్వరలో సమస్య పరిష్కరిస్తా. అలాగే అర్జిత సెలవుల విషయం కార్మికులు దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం.

'నిరుద్యోగుల కోసం పోరాటం'

కరీంనగర్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి, నిరుద్యోగ, బీసీ సంఘాల సమస్యల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న తనను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు కోరారు. గురువారం నగరంలోని వాణినికేతన్ డిగ్రీ కళాశాలలో ఆ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు చీటి అయోధ్యరామారావు విగ్రహానికి నివాళులర్పించారు.

చదరంగ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రంగా రెడ్డిలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 చదరంగ పోటీలో జీనియస్ చెస్ అకాడమీకి చెందిన శ్లోకాయుక్త ఎంపికైనట్లు జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య తెలిపారు. ఈనెల 21, 22తేదీల్లో కోల్‌కతాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ టీంలో ఆడనుంది. శ్లోకాయుక్తను జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ అనూప్ కుమార్ సన్మానించారు.

నాటక రంగ కళాకారుల సమాఖ్య ఎన్నికలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా నాటకరంగ కళాకారుల సమాఖ్య ఎన్నికలను ఈ నెల చివరి వారంలో న్విహించనున్నట్లు రాష్ట్ర బాధ్యుడు జి కృపాదానం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 8106006238, 9866569062 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

26న ఆలయ దుకాణాలకు టెండర్

కరీంనగర్ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దేవాదాయశాఖ పరిధిలోని భారత్ టాకీస్‌రోడ్ వీరాంజనేయ స్వామి ఆలయానికి చెందిన 9 దుకాణాల కిరాయికి ఈ నెల 26న ఉదయం 11 గంటలకు ఆలయ కార్యాలయంలో టెండర్ నిర్వహిస్తున్నట్లు ఈఓ నాగారపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు ఆలయంలో సంప్రదించాలని కోరారు.

హక్కుల సాధనకు బ్రాహ్మణులు ఐక్యం కావాలి

కరీంనగర్ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం బ్రాహ్మణులు ఐక్యం కావాలని బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రీరాంభట్ల దీపక్‌బాబు పిలుపునిచ్చారు. నగర సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని బ్రాహ్మణ ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి 500 కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు.

'పీఆర్సీని వెంటనే ప్రకటించాలి'



మాట్లాడుతున్న తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆదర్శన్‌రెడ్డి

హుజూరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పీఆర్సీని వెంటనే ప్రకటించాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొలంపల్లి ఆదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో తెలంగాణ టీచర్స్ యూనియన్ మండల కార్యనిర్వాహక సమావేశం మండలాధ్యక్షుడు పొద్దుటూరి కిషన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ టీచర్స్ యూని యన్ ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం అంకితభావంతో పనిచేస్తుందన్నారు. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గత దశాబ్ద కాలంగా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయి నష్టపోయిన ఉపాధ్యాయులందరికి తగిన న్యాయం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రకటించడంతో పాటు పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా 40శాతం ఫిట్‌మెంట్ పీఆర్సీ ప్రకటించి వెంటనే అమలు పరచాలన్నారు. అనంతరం 2024-25, 2025-26 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంప చంద్రశేఖర్, దానంపల్లి శ్రీనివాస్, తాళ్ల తిరుపతి, ఓరుగంటి తిరుపతి, పత్తెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుంది



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. గురువారం భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ వారిచే ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని అన్నారు. విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య మాట్లాడుతూ మనిషిని తీర్చిదిద్దడానికి పుస్తకాలు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకుడు మిలుకూరు వాసుదేవరెడ్డి, నవ తెలంగాణ మేనేజర్ యాదగిరి, పాఠశాల ప్రిన్సిపల్ మిథున్ జె మిస్త్రి, వైస్ ప్రిన్సిపల్ సాగర్, ఏఓ తుంగాని సంపత్, బుక్ హౌజ్ నిర్వాహకుడు పురుషోత్తం సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతలు

కరీంనగర్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ విజేతలను జేవీవీ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్ రావు, కోశాధికారి జి.అశోక్, రాష్ట్ర కార్యదర్శి సి.రామరాజు, జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మారెడ్డి, ఒలింపియాడ్ ఇన్‌చార్జి సమియొద్దీన్ ప్రకటించారు. 24 టీములు పాల్గొన్న ఈ టెస్ట్‌లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు సుహానా, సనా తస్నీనర్, నీష్ర ఫాతిమా, చాన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.అక్షర, జి.లక్ష్మీభవాని, ఎం.నిత్య, చింతకుంట పాఠశాల విద్యార్థులు ఎండి దూలే పాష, జె.ప్రశాంత్, ఎం.సాత్విక విజేతలుగా నిలిచారు.

ప్రైవేట్ విభాగంలో రత్నం పాఠశాల విద్యార్థులు కె.వర్షిణి, ఎం.సాయి రమణ, కె.తేజస్విని, అల్ఫోర్స్ విద్యార్థులు కె.వర్షిత్ రెడ్డి, ఆర్.సర్వజ్ఞ, ఎ.శివకైలాస్‌రెడ్డి, రుక్మాపూర్ సైనిక పాఠశాల విద్యార్థులు బి.రిష్వంత్, దుర్గం హర్షిత్, కె.తేజెశ్వర్ విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు. ఈకార్యక్రమంలో రత్నం స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రపంచ మత్స్యకార దినోత్సవం

కరీంనగర్ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సప్తగిరికాలనీలోని గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగుల కనుకయ్య, గడప కోటేశ్‌కుమార్, గడప సత్యనారాయణ, గడప లక్ష్మీనారాయణ, పెద్దపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

●గణేశ్‌నగర్: ఎస్ఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామకృష్ణ, జంతుశాస్త్ర అధిపతి రమేష్ బాబు పాల్గొన్నారు.

●శంకరపట్నం: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డుతో పాటు పలు గ్రామాల్లో ముదిరాజు కులస్తులు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మండలాధ్యక్షుడు పోలవేణి బిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె స్వరూప పాల్గొన్నారు.

●చొప్పదండి: చొప్పదండిలో ముదిరాజ్ కులస్తులు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు చీకట్ల లచయ్య, అధ్యక్షుడు కుందేళ్ళ బాలకిషన్ పాల్గొన్నారు.

●రామడుగు: మండల కేంద్రంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులతో పీసీసీ చీఫ్ సమావేశం

కరీంనగర్ క్రైం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల గురించి చర్చించినట్లు కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న రెడ్డి తెలిపారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కలిసిన కిమ్స్ చైర్మన్



బాలకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కిమ్స్ చైర్మన్ రవీందర్‌రావు

కరీంనగర్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకృష్ణారెడ్డిని జిల్లాకు చెందిన కిమ్స్ విద్యాసంస్థల చైర్మన్ రవీందర్‌రావు గురువారం హైదరాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈసందర్భంగా రవీందర్‌రావు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల పరిష్కారానికి సహకరించాలని కోరారు.

డీర్ పార్క్‌ను సందర్శించిన అచీవర్స్ విద్యార్థులు

కరీంనగర్‌టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోతి రాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలకు చెందిన ప్రీ ప్రైమరీ విద్యార్థులు గురువారం డీర్ పార్కును సందర్శించారు. విద్యార్థులకు జంతువులు, పక్షులపై అవగాహన పెంపొందించుకోవడానికి ఈసందర్శన ఉపయోగ పడుతుందని పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

సెయింట్‌జార్జ్ విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులను అభినందిస్తున్న సెయింట్‌జార్జ్ పాఠశాల చైర్మన్ ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వహించిన పోటీల్లో సెయింట్‌జార్జ్ పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. ఈనెల 14నుంచి 19 వరకు నిర్వహించిన మెమెరీ గేమ్, చిత్రలేఖన, వ్యాసరచన, క్విజ్, పాటల పోటీలు, రంగోలి, మెహందీ, వక్తృత్వ పోటీల్లో పాల్గొన్నారు. వ్యాసరచన పోటల్లో మీనాక్షికి రెండవ బహుమతి, మెమోరీ గేమ్‌లో ప్రత్యూష రెండవ బహుమతిని సాధించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ ఫాతిమారెడ్డి అభినందించారు.

'క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి'



మాట్లాడుతున్న మెడికవర్ ఆసుపత్రి వైద్యులు

సుభాష్‌నగర్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని మెడికవర్ వైద్యులు తెలిపారు. గురువారం నగరంలోని మెడికర్ ఆసుపత్రిలో ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్యాంక్రియాటిక్ అనేది శరీరంలో జీర్ణవ్యవస్థను మెరుగు పరచడానికి, షుగర్‌ను సమతుల్యం చేయడానికి పనిచేస్తుందన్నారు. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే ప్రాణాల కాపాడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ దిలీప్‌రెడ్డి, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ప్రణీత్, డాక్టర్ నటరాజ్, డాక్టర్ వినయ్‌కుమార్, సూపరింటెండెంట్ రవి మల్లారెడ్డి, మార్కెటింగ్ హెడ్ కరుణాకర్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఎన్ఆర్ఐ చేయూత

సుభాష్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమానికి ఎన్ఆర్ఐ చేయూతనందించారు. నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన కడార్ల ప్రభాకర్, నాగరత్న కూతురు కడార్ల అనూష అమెరికాలో ఉంటున్నారు. అమెరికాలో మన్నెసోట ఏరియా తెలంగాణ అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వెలిచాల గ్రామంలో గల స్పందన సంస్థ ఆశ్రమానికి లక్ష రూపాయల విలువగల వస్తువులను ఆశ్రమ నిర్వాహకుడు మంచికట్ల శ్రీనివాస్‌కు అందచేశారు.

అమెరికా సదస్సులో పాల్గొనేందుకు మేయర్‌కు ఆహ్వానం

కరీంనగర్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అమెరికాలో జనవరి 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న వరల్డ్ ఆఫ్ కాంక్రీట్ సదస్సులో పాల్గొనేందుకు మేయర్ యాదగిరి సునీల్‌రావుకు ఆహ్వానం అందింది. సదస్సులో అత్యాధునిక టెక్నాలజీకి సంబంధించిన పరికరాలను ప్రదర్శించనున్నారు.

ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడా ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఒలంపిక్, రాష్ట్ర క్రీడా సంఘాలకు చెందిన గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, నందెల్లి మహిపాల్, మహ్మద్ కరీం, వై ఉపేందర్‌రావు, సిలివేరి మహేందర్‌లు తమ ఓటును వినియోగించుకున్నారు.

కరాటే ఇన్‌స్ట్రక్టర్‌కు సన్మానం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సీనియర్ బ్లాక్ బెల్ట్ గ్రహీత, కరాటే శిక్షకుడు కె.వసంత్ కుమార్‌ను గురువారం ఏసీబీ డైరెక్టర్ జనరల్ విజయ్ కుమార్ ప్రశంసాపత్రం అందించి సన్మానించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో జరిగిన పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమంలో ఈ ప్రశంసా పత్రాన్ని అందించారు. తొమ్మిది నెలలుగా శిక్షణ పొందుతున్న కానిస్టేబుల్స్‌కు అన్ ఆర్మ్‌డ్ కం బ్యాట్ విభాగంలో శిక్షణను అందించినందుకు వసంత్ కుమార్‌ను పత్యేకంగా అభినందించారు.

'కుటుంబ సమగ్ర సర్వే పకడ్బందీగా నిర్వహించాలి'



నగునూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలో సర్వే తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రేపటిలోగా వంద శాతం సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో ఇంకా ఎవరైనా కుటుంబ సర్వేలో పేర్లు నమోదు చేసుకోని వారు ఉంటే వారిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు.

అనంతరం నగునూర్‌లో పోచమ్మకుంట వద్ద సుడా నిధులు పది లక్షల రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి పనులు, వాకింగ్ ట్రాక్ పనులను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఆర్ఐ కనకరాజు, కార్యదర్శి లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ లెక్చరర్ పోస్టుకు ఎంపిక



మార్కండేయ

మానకొండూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన భైరి మార్కండేయ జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక అయ్యారు. మార్కండేయ 2006 డీఎస్సీలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా 91.5 మార్కులతో ఉద్యోగం సాధించాడు. 2012 టెట్‌లో 129 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీష్)కు ఎంపిక అయ్యారు. అదే ఏడాది గ్రూప్2లో నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగం వచ్చినా అందులో చేరలేదు. కాగా గురువారం ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ ఫలితాలలో జూనియర్ లెక్చరర్‌గా ఎంపిక కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన రంగు విశ్వసాయి సైతం జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు. విశ్వసాయి మూడు నెలలుగా నిర్మల్‌లోని బీసీ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్రం అధ్యాపకుడిగా పని చేస్తున్నారు

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

శంకరపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీత జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గిట్ల ముకుందరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లోని సీతారాం ఏచూరినగర్‌లో ఈ నెల 29, 30వ తేదీల్లో నిర్వహించనున్న పార్టీ జిల్లా మహాసభలకు తరలిరావాలని కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల వివరాలు ఏర్పాటు చేయాలి

హుజూరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అధికారుల పేర్లు, హోదా, ఫోన్ నంబర్లు ప్రజలకు తెలిసే విధంగా కార్యాలయంలో బోర్డులు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల శంకర్ గురువారం అన్నారు. స్థానికంగా గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌తో భవిష్యత్తు బాటలు వేసుకోవచ్చని కిట్స్ కళాశాల డైరెక్టర్ కందుకూరి శంకర్ అన్నారు. సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవడంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సారార్ ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ రూపేష్, ఎన్ఐటీ ఆంగ్ల విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ కన్నెనాథ్ మల్హరి శిక్షణ ఇచ్చారు.

డబుల్ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

గన్నేరువరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి స్టేజి రాజీవ్ రహదారి నుంచి పొత్తూరు వరకు చేపడుతున్న డబుల్ రోడ్డు పనులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ మేరకు గుండ్లపల్లి స్టేజి వద్ద తారు వేసే పను లను ఆయన ప్రారంభించారు. మండల ప్రజల సౌకర్యార్థం డబుల్ రోడ్డు నిర్మాణం చేపడు తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవిందర్‌రెడ్డి, బొల్లి శంకరయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

తిమ్మాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి అన్నారు. శ్రీచైతన్య ఫార్మసీ కళాశాలలో గురువారం జాతీయ ఫార్మసీవారోత్సలను ఆయన ప్రారంభించారు.. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామనరసింహరెడ్డి, ప్రొఫెసర్ అప్పారావు, డైరెక్టర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర సర్వేపై ఆందోళన

- 92.49 శాతం పూర్తయినట్లు అధికారుల వెల్లడి



మానకొండూర్‌లో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్

మానకొండూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుల, రాజకీయ, సామాజిక, ఆర్థిక సర్వేపై మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో మొత్తం 22,930 ఇళ్లను ఎన్యూమరేటర్లు గుర్తించారు. మండలంలో 27 గ్రామపంచాయితీలకు గాను 188 ఎన్యుమరేటర్ బ్లాక్‌లను ఏర్పాటు చేశారు. 188 మంది ఎన్యుమరేటర్లు, 18 మంది సూపర్‌వైజర్లను నియమించారు. ఒక్కొక్క ఎన్యుమరేటర్‌కు 150 నుంచి 175 వరకు సుమారు 75 వరకు ప్రశ్నలతో సర్వే చేయాలని సంబందిత అధికారులు ఆదేశించారు. ఈ సర్వేలో కుటుంబానికి సంబంధించిన పూర్తి వివరాలను ఎన్యుమరేటర్‌కు చెప్పడంతో ప్రభుత్వ పథకాలు రాకుండా పోతాయోమోనని మండల ప్రజలు అనాసక్తితో వివరాలను గోప్యంగా ఉంచుతున్నట్లు సమాచారం. గురువారం వరకు 21,209 ఇళ్లకు వెళ్లామని, 92.49 శాతం సర్వే చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. శుక్రవారంలోగా సర్వే పూర్తి చేయాల్సి ఉన్నందున వంద శాతం పూర్తవుతుందా అన్న సందిగ్ధత నెలకొంది.

బస్సుల సంఖ్య పెంచాలి

గన్నేరువరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం, చొక్కారావుపల్లి, పారువెల్ల, మైలారం గ్రామాలకు ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్నందున ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలని కాంగ్రెస్ మండల నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు కరీంనగర్ డిపో మేనేజ ర్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు దుడ్డు మల్లేశం, బద్దం సంపత్‌రెడ్డి, పరిపూర్ణాచారి, గ్రామస్థులు పాల్గొన్నారు.

నాగార్జున డెయిరీ సందర్శన

హుజూరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణ శివారులోని నాగార్జున డెయిరీని ఏకశిల పాఠశాల విద్యార్థులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డెయిరీలో పాల శీతలీకరణ యంత్రాలను, పాలు ఎలా నిల్వ చేశారు, పాల పదార్థాలను ఏ విధంగా తయారు చేస్తారని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ దినేష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దూడల నరేష్ పాల్గొన్నారు.

26న ఓటరు జాబితాపై సమావేశం

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 26న గ్రామపంచాయతీ ఓటరు జాబితాపై సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో టి సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా సకాలంలో హాజరు కావాలని కోరారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలి

గంగాధర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలని, బడుగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల రవి డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కు పార్టీ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా హాజరైన ఆయన మాట్లా డుతూ పేద బడుగు బలహీన వర్గాలు రాష్ట్రంలో విద్యా, వైద్యం, ఉపాధి, ఇల్లు, భూమి వంటి సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కేజీ టూ పీజీ నాణ్యమైన ఉచిత విద్య, ఉచిత వైద్యాన్ని అందించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సభ్యులు బాబు, నరేష్, రమేశ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడదను నివారించాలి

హుజూరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో కోతుల బెడ దను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని 26వ వార్డు కౌన్సిలర్ కేసిరెడ్డి లావణ్య- నర్సింహారెడ్డి గురువారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వినతి పత్రం అందజేశారు. పట్టణంలో కోతుల బెడద అధికంగా ఉందని, ప్రజలు బయటకు రావాలంటే భయపడు తున్నారన్నారు. వందల కోతులు రోడ్లపై, ఇళ్లపై తిరుగుతూ గాయపరుస్తున్నాయన్నారు. మున్సిపాలిటీ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని కోతుల బెడదను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూత్ నాయకులు విజయ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకుల క్షీరాభిషేకం



సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లందకుంట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద సీనియర్ నాయకులు వంగ రామకృష్ణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో నిత్య అన్నదాన సత్రానికి ప్రభుత్వం రూ. 35.25కోట్లు మంజూరు చేయడం అభినందనీయ మన్నారు. కరీంనగర్ జిల్లాకు రూ. వెయ్యి కోట్ల నిధులతో నేతన్నలకు యూరన్ డిపో మంజూరుకు హామీ ఇవ్వడం హర్షనీయమని కొనియాడారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో గూడెపు సారంగపాణి, తిరుపతిరెడ్డి, రమేష్, అయి లయ్య, జలందర్‌రెడ్డి, వీరారెడ్డి, సాయి, సారంగం, రాజ బాబు, దిలీప్, మదన్‌రావు, సదానందం, చిరంజీవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

● జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి రేణికుంట్ల మల్లికార్జున్ హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిం చిన హామర్‌త్రో పోటీల్లో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

● జమ్మికుంట రూరల్: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నూతనంగా నియామకమైన పుల్లూరి స్వప్న-సదానందంను తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి రాచపల్లి సాగర్ ఆధ్వర్యంలో సన్మానించారు.

● శంకరపట్నం: రైతులు వరి కొయ్యలను కాల్చొద్దని మండల వ్యవసాయాధికారి వెంకటేష్ అన్నారు. మండలంలోని చింతగుట్టలో వరి కొయ్యలను కాల్చడం వల్ల జరిగే నష్టాలపై రైతులకు వివరించారు.

● వీణవంక: గంగారం జడ్పీహెచ్ఎస్ పాఠ శాలలోని విద్యార్థులకు గ్రామానికి చెందిన న్యాయవాది అంకటి సురేందర్‌రెడ్డి సహకా రంతోఐడీ కార్డులు అందజేశారు.

- మండలంలోని ఘన్ముకుల గ్రామానికి చెందిన కాయిత రాజేందర్-సరిత కుమార్తె లక్ష్మీప్రియ ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్‌లో ఇటీవల నిర్వహించిన నేషనల్ గ్రాప్లింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది.

● హుజూరాబాద్: ముస్లిం కబ్రిస్తాన్ పేరు ధరణిలో నమోదు చేయాలని జామే మస్జిద్ ఈద్గా కబ్రిస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆర్డీవో రమేష్‌బాబు, తహసీల్దార్ కనకయ్యకు వినతిపత్రం అందజేశారు.

● చొప్పదండి: కరీంనగర్‌లో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రిశ్వంత్, హర్షిత్, తేజేశ్వర్ ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీకాళహస్తి తెలిపారు.

● చిగురుమామిడి: పాల ఉత్పత్తి దారుల సంక్షేమమే తమ లక్ష్య మని హుస్నాబాద్ బల్క్‌మిల్క్ కేంద్రం మేనేజర్ చింతపూల నాగయ్య అన్నారు. ఉల్లంపల్లిలో పాల ఉత్పత్తిదారుడు కోల చంద్రయ్య కూతురు పూజ వివాహానికి కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తెమట్టెలను అందజేశారు.

● హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యన భ్యసించాలని హుజూరాబాద్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పద్మసాయి అన్నారు. మండలంలోని చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సూచనలు చేశారు.

● సైదాపూర్: నూతనంగా నియామకమైన మండల వ్యవసాయ మార్కెట్ పాలకవర్గాన్ని కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయంలో గురువారం సన్మానించారు.